అతివేగంగా, పెద్ద శబ్దాలతో వాహనాలు నడుపు ప్రజలను ఇబ్బందులు పెడితే సహించం

- *యువత ఆదర్శంగా ఉంటూ ప్రమాదాలకు దూరంగా ఉండాలి: సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ*

దశ, కోదాడ టౌన్: నిబంధనలకు విరుద్ధంగా బైక్‌ల సైలెన్సర్లు మార్చి, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులపై కోదాడ పట్టణ, కోదాడ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. సైలెన్సర్ లు మార్చి అధిక శబ్దంతో పట్టణంలో ఇష్టారాజ్యంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవడం కోసం స్పెషల్ నిర్వహించారని ఎస్పి నరసింహ తెలిపినారు, ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా సీజ్ చేసిన 40 మోడిఫైడ్ సైలెన్సర్లను మంగళవారం పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ..మితిమీరిన శబ్దాలు చేస్తూ ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, రోగులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ సైలెన్సర్లను మాత్రమే వాడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో ప్రశాంతతకు భంగం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ తెలిపారు. యువత ఆదర్శంగా ఉండాలి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివ శంకర్, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజురాబాద్ యూనిట్ అధ్యక్షునిగా గంజి జయవర్ధన్ ఏకగ్రీవ ఎన్నిక

దశ, హుజురాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం హుజురాబాద్ యూనిట్ అధ్యక్షస్థానానికి గంజి జవర్ధన్ ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి దొంత శ్రీనివాస్. ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన జి మనోహర్ గౌడ్.ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ పాషా ముఖ్యఅతిథిగా విచ్చేసి వారు మాట్లాడుతూ హుజురాబాద్ ఉద్యోగుల సంఘం టి ఎస్ జి ఆర్ ఈ ఏ. కి ఒక మంచి గుర్తింపు ఉందని గత రెండు పర్యాయాలు అభివృద్ధి పథంలో 2. భవనాల నిర్మాణం చేసి జిల్లాలోని నెంబర్ వన్ గా నిల్పామని జిల్లాలో ఎక్కడ లేని విధంగా రిటైర్ ఉద్యోగులు సంఘం బలోపేతంగా ఉందని అందరం ఐక్యతతో ప్రతి ఎన్నికను ఏకగ్రీవంగా జరుపుకుంటున్నామని ఇదే మునుముందు కూడా కొనసాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్ ఉద్యోగులకు ఇచ్చిన కాల వ్యవధిలోనే పి ఆర్ సి అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హెల్త్ కార్డుల జారి కూడా ప్రభుత్వం కనుకున్న సమయంలో అందించిందని అన్నారు. కార్యవర్గ సభ్యులు. హుజురాబాద్ యూనిట్ సభ్యులు. పాల్గొన్నారు.

'అమ్మ, నాన్న క్షమించండి.. నేను చనిపోతున్నా'.. హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

దశ, హైదరాబాద్: హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య తీవ్ర విషాదం కలిగించింది. కాలేజీ లెక్చరర్ల మానసిక వేధింపుల కారణంగానే తమ కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనాస్థలంలో లభించినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో తల్లిదండ్రులకు క్షమాపణలు చెబుతూ కాలేజీలో ఎదురైన అవమానాలను ప్రస్తావించినట్లు సమాచారం. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి సూసైడ్ నోట్‌పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ మణికొండలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఇబ్రహీంబాగ్‌లోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న శ్రేయ అనే యువతి.. తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనాస్థలంలో దొరికిన సూసైడ్ నోట్.. శ్రేయ కుటుంబ సభ్యుల చేస్తున్న ఆరోపణలు.. ఈ వ్యవహారం మరింత తీవ్ర చర్చకు దారితీసేలా చేస్తున్నాయి. అయితే సూసైడ్ నోట్‌లోని వివరాలు, కాలేజీ సిబ్బందిపై వచ్చిన ఆరోపణలు అధికారిక దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

'ప్లేస్టోర్‌లో యాప్‌ల వల్లే సైబర్ మోసానికి గురయ్యాం..'

❖ *బాధితుల ఫిర్యాదుతో గూగుల్ ఇండియా హెడ్‌పై కేసులు*

దశ, హైదరాబాద్: సైబర్ క్రైమ్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గూగుల్ ఇండియా హెడ్‌పై సైబర్ ఫ్రాడ్ కేసులు నమోదు చేశారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని మోసపోయిన ముగ్గురు బాధితుల ఫిర్యాదు మేరకు ఈ కేసులు బుక్ చేశారు. బాధితులు దాదాపు రూ. 48 లక్షల వరకు నష్టపోవడంతో నిందితులతో పాటు గూగుల్ ఇండియా హెడ్‌ను కూడా ఈ మూడు కేసుల్లో సహ నిందితుడిగా చేర్చారు. అధికారిక ప్లే స్టోర్‌లో నకిలీ యాప్‌లు లభించడం వల్లే తాము మోసపోయామని బాధితులు తెలిపారు. గూగుల్ ఇండియా హెడ్‌పై సైబర్ ఫ్రాడ్ కేసులు నమోదు చేస్తూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా లభ్యమైన నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసి లక్షల్లో నష్టపోయిన బాధితుల ఫిర్యాదుల ఆధారంగా గూగుల్ ఇండియా అధిపతిని మూడు వేర్వేరు సైబర్ నేరాల కేసుల్లో సహ నిందితుడిగా చేరుస్తూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గూగుల్ వంటి అధికారిక యాప్ మార్కెట్‌ప్లేస్‌లో ఉన్నాయనే ఏకైక నమ్మకంతోనే తాము ఆయా యాప్‌లను డౌన్‌లోడ్ చేసి డబ్బులు పెట్టుబడి పెట్టామని.. ఈ నష్టానికి గూగుల్ సంస్థ నిర్లక్ష్యం కూడా కారణమని బాధితులు తమ ఫిర్యాదుల్లో పేర్కొనడంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

మునగనూరు ప్రభుత్వ భూముల అక్రమాలపై విచారణ జరపాలి: డా. బూర నర్సయ్య గౌడ్

దశ, రంగారెడ్డి: తుర్కయమజల్ మున్సిపాలిటీ పరిధిలోని ముంగనూరు గ్రామ ప్రభుత్వ భూముల్లో అక్రమ మార్పిడులు, రికార్డులలో మార్పులు, నిషేధిత జాబితా నుంచి తొలగింపులు జరిగాయని ఆరోపిస్తూ మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్లు 44/2, 44/4, 44/5తో పాటు 44/6, 44/8, 44/9, 44/10, 44/11లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ పట్టాలు, రిజిస్ట్రేషన్లు, NALA అనుమతులను రద్దు చేసి భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని కోరారు. బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు, హక్కుల బదిలీలు జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిమినేటి నర్సింహారెడ్డి, నారాయణ యాదవ్, బోసుపల్లి ప్రతాప్, కొత్త రాంరెడ్డి, బచ్చుగళ్ల రమేష్, కొంద్రు పురుషోత్తం తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బుగ్గయ్య కుటుంబానికి BRR ఫౌండేషన్ అండ

దశ, ఇబ్రహీం పట్నం : సామాన్యులజీవితాల్లో వెలుగులు నింపడమే BRR ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ సభ్యులు పున్నం రాము అన్నారు. ఆరుట్ల గ్రామానికి చెందిన తిమ్మగల్ల బుగ్గయ్య అకాల మరణం ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుగ్గయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఫౌండేషన్ సభ్యులు, దినకర్మ కార్యక్రమం కోసం బియ్యాన్ని అందజేశారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలన్నదే BRR ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి లక్ష్యమని పున్నం రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో మంకు అంజయ్య, కొండిగారి లక్ష్మణ్, బుచ్చిరాములు, సద్దాం, బర్మల వెంకటేష్, షాకీర్, గుడిమల్లి బాలరాజు, బాహుబలి శివ, మనోహర్, తరుణ్తో పాటు కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఢిల్లీ లాఠీచార్జీకి నిరసనగా ఓయూలో విద్యార్థుల ఆందోళన

దశ, ఓయూ: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడాన్ని ఖండిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులపై జరిగిన చర్యను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తూ, దీనిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరారు. అలాగే, నీట్ లీకేజీ ఘటనలతో తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తలా రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దేశంలో వరుసగా పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ వైఖరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి ఉద్యమాలపై అణచివేత చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, టీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్, జేవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చీరల వంశీ, ఓయూ విద్యార్థి నాయకులు ఆవుల శ్రీధర్ యాదవ్, సిద్ధు యాదవ్, ప్రభాకర్, శివ యాదవ్, గణేష్, సాయి కిరణ్, మనోజ్ గౌడ్, నవీన్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీవీఎం

దశ ఓయూ: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) రాష్ట్ర అధ్యక్షుడు భూంపల్లి రవితేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నారని, దాదాపు రూ.10 వేల కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యాసంస్థలకు నిధులు అందడం లేదని, మరోవైపు విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించలేక చదువును మధ్యలోనే విరమించుకునే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి భారతీయ విద్యార్థి మోర్చా నిరంతరం పోరాడుతుందని, బకాయిల విడుదలలో జాప్యం కొనసాగితే రానున్న రోజుల్లో పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో బీవీఎం మహిళా నాయకురాలు సరస్వతి, ప్రవీణ్, కిషోర్, మనోజ్, అరుణ్ నంద, శ్యామ్, రాజు, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ను కలిసిన విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ

దశ ఓయూ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. జయలక్ష్మిని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు కలిసి దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాల్లో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు దివ్యాంగుల హక్కుల చట్టం-2016పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీలు ఇవ్వడం, ప్రత్యేకంగా 'డిసేబిలిటీ సెల్' ఏర్పాటు చేయడం, అన్ని విభాగాల్లో ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇటీవల విడుదల చేసిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో దివ్యాంగులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపై స్పందించిన రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. జయలక్ష్మి, సమస్యలను వైస్ చాన్స్‌లర్ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దొరపల్లి దానమ్మ, రాష్ట్ర సభ్యుడు ఆంజనేయులు కురుమ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో శిఖం భూముల ఆక్రమణ

❖ కొందరికే నోటీసులు ఇవ్వడంలో ఆంతర్యమేమిటి?

❖ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితుల ఆందోళన

దశ, హుజూర్‌నగర్: హుజూర్ నగర్ ఊర చెరువు సర్వే నెంబర్ 240లో ఆక్రమణలో నివాసం ఉంటున్నారంటూ తహసీల్దార్ బండ కవిత నోటీసులు జారీ చేయడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు మంగళవారం పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ కార్యాలయ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. మా ఇళ్ళ జోలికి రావద్దు, మమ్మల్ని బతకనీయండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అదే సమయంలో తహసీల్దార్ కవిత కార్యాలయానికి రావడంతో ఆమెను అడ్డుకున్నారు. తమ గోడును వెళ్ళబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆమె కాళ్ళ మీద పడ్డారు. గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమను ఉన్న ఫలంగా షోకాజ్ నోటీసులు జారీ చేసి,ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న తమని భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమ తాతల పూర్వీకుల నుంచి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు తమకు నోటీసులు ఇవ్వలేదని ట్యాంక్ బండ్ నిర్మాణం జరిగినా, తమ ఇండ్లకు ఇబ్బంది కలగకుండా నిర్మాణం చేపట్టి, ఎవరిది నీరు పోరాటానికి కాలువ కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. తాము ప్రభుత్వానికి మున్సిపాలిటీ టాక్స్,కరెంట్ బిల్లులు, మిషన్ భగీరథ నీటి బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని చెప్పారు. ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో ట్యాంక్ బండ్ నిర్మాణం జరిగినా, తమ ఇళ్లకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించారని అన్నారు. కానీ నేడు నోటీసులు జారీ చేసి 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలంటూ తమని మానసిక శోభకు గురి చేస్తున్నారని అన్నారు. తామంతా పేద కుటుంబాలకి చెందిన వారమని రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. తమ ఇళ్ళను కూల్చవద్దని, తమకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

❖ సీజేపీపై నిర్బంధాన్ని ఎత్తివేయాలి

దశ, పెబ్బేర్: పెబ్బేరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు గంధం మొగులయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏలు) రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూలై 22న నిర్వహించే నిరసన కార్యక్రమాలను రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, సీబీఎస్ఈ అక్రమాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసి ఆయనను నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే కేంద్ర ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, యువత చేపడుతున్న ఆందోళనలను అణచివేస్తోందని ఆరోపించారు. సీజేపీ జాతీయ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే అరెస్టును ఖండిస్తూ, ఆయనను వెంటనే విడుదల చేయాలని, సోనం వాంగ్‌చుక్‌పై విధించిన నిర్బంధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులు గంధం మొగులయ్య, నాగన్న, రాముడు, రాజు, గాంధీ, ఎల్లస్వామి, బుచ్చన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

వేములవాడ ఆలయంలో విచిత్ర ఘటన.. రూ.7 లక్షల విరాళం వెనక్కి ఇవ్వాలని రిక్వెస్ట్

దశ, రాజన్న సిరిసిల్లా జిల్లా: రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఒక విచిత్ర పరిణామం చోటుచేసుకుంది. వేములవాడకు చెందిన వృద్ధ దంపతులు తమ ఏడుగురు కుమార్తెల పెళ్లిళ్లు పూర్తయ్యాక తమ వద్ద ఉన్న రూ. 7,01,116 పొదుపు సొమ్మును ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళంగా సమర్పించారు. అయితే.. తమ తండ్రికి మతిస్థిమితం సరిగా లేదని ఆ సొమ్మును తమ తల్లిదండ్రుల పోషణ నిమిత్తం వెనక్కి ఇవ్వాలని కుమార్తెలు ఆలయ అధికారులను కోరారు. దేవుడికి సమర్పించిన విరాళాన్ని నియమాల ప్రకారం వెనక్కి ఇవ్వలేమని అధికారులు స్పష్టం చేయడంతో వారు నిరాశతో వెనుతిరిగారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఒక విచిత్రఘటన వెలుగుచూసింది. జీవిత చరమాంకంలో ఉన్న ఓ వృద్ధ దంపతులు తమ వద్ద ఉన్న జీవితకాల కష్టార్జితాన్ని దేవుడికి విరాళంగా ఇవ్వగా.. ఆ తర్వాత వారి కుమార్తెలు ఆలయ అధికారుల వద్దకు వచ్చి ఆ డబ్బును వెనక్కి ఇవ్వాలని రిక్వెస్ట్ చేశారు. ఈ ఘటన స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

వివరాల్లోకి వెళితే.. వేములవాడకు చెందిన వృద్ధ దంపతులకు ఏడుగురు కుమార్తెలు. బాధ్యతాయుతంగా తమ కుమార్తెలందరి వివాహాలు జరిపించిన ఆ దంపతులు.. ప్రస్తుతం శేష జీవితాన్ని ప్రశాంతంగా గడుపుతున్నారు.

వేములవాడ రాజన్నపై ఉన్న అపారమైన భక్తిశ్రద్ధలతో ఆ దంపతులు సోమవారం (జులై 21) ఆలయానికి వచ్చి తమ వద్ద పొదుపు చేసుకున్నరూ. 7,01,116 భారీ మొత్తాన్ని రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళంగా అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు శ్రీనివాస్ శర్మ, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీనివాస్‌లు వారి భక్తిని అభినందిస్తూ.. విరాళం స్వీకరించి రశీదు కూడా అందజేశారు. దేవుడి అన్నదానానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వడంతో ఆలయ సిబ్బంది కూడా వారిని శాలువాతో సత్కరించారు.

అయితే, ఈ విషయం తెలిసిన కొద్దిసేపటికే సదరు దంపతుల కుమార్తెలలో కొందరు తీవ్ర ఆందోళనతో ఆలయ కార్యాలయానికి చేరుకున్నారు. తమ తండ్రి వయోభారం వల్ల మతిస్థిమితం కోల్పోయారని, ఆలోచనా శక్తి సరిగా లేకపోవడం వల్లే ఇంట్లో ఉన్న డబ్బంతా తీసుకొచ్చి గుడికి ఇచ్చేశారని ఆలయ అధికారులకు విన్నవించారు. తమ తల్లిదండ్రుల భవిష్యత్తు వైద్య ఖర్చులు, పోషణకు ఆ డబ్బే ఆధారమని దయచేసి తమ తండ్రి ఇచ్చిన రూ. 7 లక్షల విరాళాన్ని వెనక్కి ఇచ్చేయాలని వారు అధికారులను వేడుకున్నారు. తల్లిదండ్రుల పోషణ తమకు భారమవుతుందని ఆ సొమ్ము ఉంటేనే వారు ప్రశాంతంగా ఉండగలరని మొరపెట్టుకున్నారు.

ఈ విన్నపంపై స్పందించిన ఆలయ అధికారులు తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం.. దాతలు స్వచ్ఛందంగా అంగీకారంతో సమర్పించిన విరాళాలను ఒకసారి స్వామివారి ట్రస్టు ఖాతాలో జమ చేశాక మళ్లీ వెనక్కి ఇచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. విరాళం ఇచ్చే సమయంలో సదరు వృద్ధ దంపతులు పూర్తి స్పృహలోనే ఉన్నారని.. ఎవరి ఒత్తిడి లేకుండానే సొమ్ము ఇచ్చారని వివరించారు. దేవుడి ఖాతా నుంచి సొమ్మును తిరిగి ఇచ్చే అధికారం తమకు ఉండదని తెగేసి చెప్పారు. దీంతో చేసేదేం లేక ఆ కుమార్తెలు తీవ్ర నిరాశతో ఆలయ ప్రాంగణం నుంచి వెనుతిరిగారు. ఈ ఘటన వేములవాడ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి: కోదండరాంకు వినతి

దశ, చిన్నంబావి: తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల కమిటీ సభ్యులు కే. కేశవరావు, ప్రొఫెసర్ కోదండరాం, రాములు నాయక్, అద్దంకి దయాకర్, శోభా రెడ్డిలను చిన్నంబావి మండల తెలంగాణ ఉద్యమకారులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేసి తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల పోరాట వేదిక అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ఉద్యమకారులకు న్యాయం చేయకుండా కాలయాపన చేశాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కమిటీల పేరుతో జాప్యం చేయకుండా అసలైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇళ్లు, నెలవారీ పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు అధికారిక గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొనని వారు పదవులు అనుభవిస్తుండగా, లాఠీ దెబ్బలు తిని, నిరాహార దీక్షలు చేసి తెలంగాణ కోసం పోరాడిన అసలైన ఉద్యమకారులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత తొమ్మిదేళ్లుగా తెలంగాణ ఉద్యమకారులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు అనేక సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని డాక్టర్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి తగిన గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలని కమిటీని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు రామన్ గౌడ్, లక్ష్మీజి, పెరుమాళ్ శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, తిరుపతయ్యతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొని వినతిపత్రాలు సమర్పించారు.

పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

❖ సీపీఎం డిమాండ్

దశ, బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామానికి చెందిన 40 నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వెంటనే అందజేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోని బృందం టేకులచెరువు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీని సందర్శించి పరిస్థితిని పరిశీలించింది. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టారని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టేకులచెరువు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తూ లబ్ధిదారుల జాబితా ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు వారికి ఇళ్లను అప్పగించకపోవడం బాధాకరమని విమర్శించారు. కాలనీలో ఇప్పటికీ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తికాలేదని, మంచినీటి సౌకర్యం, విద్యుత్ వైరింగ్, అంతర్గత రహదారులు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక వసతులు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అన్ని మౌలిక సదుపాయాలను పూర్తి చేసి అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన ఎంసీపీఐయూ

దశ, మంచిర్యాల: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలు ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం, విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్లతో గత 20 రోజులుగా విద్యార్థులు శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

అలాంటి పరిస్థితుల్లో విద్యార్థి ప్రతినిధులతో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన కేంద్ర ప్రభుత్వం, బలప్రయోగానికి పాల్పడడం బాధాకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ

హక్కు అని, ఆ హక్కును లాఠీచార్జ్‌లు, బాష్పవాయు గోళాలతో అణచివేయడం సమంజసం కాదన్నారు. విద్యార్థులపై జరిగిన దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వారి న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

❖ రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్

దశ, మంచిర్యాల: జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుండి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతి భద్రతల అధికారులు, రవాణా, రహదారి భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, రవాణా, రహదారులు భవనాల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలు ప్రతినెల నిర్వహించాలని తెలిపారు. టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు ఆర్థిక స్థిరత్వం

❖ 20 వేల ఎకరాలు పూర్తైతే పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ

❖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దశ, ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో నిర్వహించిన ఆయిల్ ఫామ్ సాగు రైతుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ, ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, గిరిజనాభివృద్ధి, గోదావరి జలాల వినియోగం తదితర అంశాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని అందించే పంట అని పేర్కొన్నారు. గిరిజన కుటుంబాల ఆదాయం పెరిగితేనే వారి పిల్లల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని అన్నారు.

ప్రస్తుతం ములకలపల్లి మండలంలో 8 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతోందని, దీన్ని 20 వేల ఎకరాలకు విస్తరిస్తే వెంటనే పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పోడు భూముల్లో ఆయిల్ ఫామ్ సాగుకు అవసరమైన విద్యుత్ సమస్యల పరిష్కారానికి సౌర విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఆయిల్ ఫామ్‌తో పాటు మునగ, పప్పుధాన్యాలను అంతర పంటలుగా

సాగు చేస్తే అదనపు ఆదాయం లభిస్తుందని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షపాతం తగ్గి భూగర్భ జలాలు పడిపోతున్నాయని పేర్కొన్న మంత్రి, బోర్లపై ఆధారపడి వరి సాగు చేయకుండా పెసర, మినుము, కంది, అలసంద వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పత్తిలో కందిని అంతర పంటగా సాగు చేస్తే భూమి సారం పెరగడంతో పాటు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు.

ప్రతి రైతు ఉపాధి హామీ పథకం ద్వారా తన పొలంలో ఫామ్ పాండ్ నిర్మించుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని, దీంతో భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి ఉపయోగపడతాయని చెప్పారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించడమే తన జీవిత లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయిన వెంటనే చెరువులు నింపి ప్రతి రైతు పొలానికి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో కోతుల బెడదపై రైతులు ప్రస్తావించగా, అడవుల నరికివేత, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్లే అడవి జంతువులు గ్రామాలకు వస్తున్నాయని మంత్రి అన్నారు. మర్రి, వెదురు, చింత వంటి స్థానిక జాతుల మొక్కలను విస్తృతంగా నాటి అడవులను సంరక్షించాలని పిలుపునిచ్చారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు జరుగుతోందని, ఈ ఏడాది మరో 15 వేల ఎకరాలకు విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేస్తున్నామని, వరికి బదులుగా మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, మునగ, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం కంది, మినుము విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి, జిల్లా కలెక్టర్ రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆయిల్ ఫామ్ సంస్థ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.